క్లుప్తంగా

ఇంటింటికి 'బీజేపీ'



వివేక్‌కు స్వాగతం పలుకుతున్న మహిళ

మందమర్రిరూరల్: పట్టణంలోని కాలనీల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

'అప్లికేషన్ భరో'కు విశేష స్పందన

జన్నారం: దళితబంధు పథకం కోసం ఏర్పాటు చేసిన 'అప్లికేషన్ భరో' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల నుంచి దళితులు తరలివచ్చారు. వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు దళితబంధు అప్లికేషన్‌ను నింపారు. మండలం నుంచి 120అప్లికేషన్లను నింపినట్లు వినోద్‌నాయక్ తెలిపారు. దరఖాస్తు ఫారాలను తహసీల్దార్ కిషన్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, నాయకులు ఇందయ్య, రమేశ్, శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17న బెల్లంపల్లిలో జాబ్‌మేళా

బెల్లంపల్లి: ఈ నెల 17న బెల్లంపల్లిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి అభివృద్ధి సంస్థ ఫౌండేషన్ సెక్రెటరీ ఆదర్శ్‌వర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. టాగ్స్ 24 ఇన్‌టూ సెవెన్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా డిగ్రీ చదివిన విద్యావంతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బేసిక్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్, బేసిక్ కంప్యూటర్ ఆపరేషన్ నాలెడ్జ్ కలిగి ఉండి టైపింగ్, ఎక్సెల్, వర్డ్, గూగులింగ్, ఈ మెయిల్ వచ్చి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యావంతులు కాల్‌టెక్స్ ఏరియాలోని వాల్యూఫిచ్ కంపెనీ కార్యాలయంలో ఉదయం 10–30గంటల ప్రాంతంలో ఎలిజిబుల్ టెస్ట్‌కు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9391890719, 7981928687 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుల నియామకం

బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మంచిర్యాల జిల్లా నుంచి కొయ్యల ఏమాజీ, రాజులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారి సేవలు వెంటనే అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపించండి'

దండేపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికీ వెళ్లి అందరినీ పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

'అన్ని వరాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే...'

కోటపల్లి: అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అధికారంలోకి వస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ పీసీసీ సభ్యులు నూకల రమేశ్ అన్నారు. నాగంపేట, బొప్పారం గ్రామాల్లో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటా కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తూ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను గ్రామస్తులతో చర్చించారు. ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లుతో పాటు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. నిరుద్యోగ భృతితో పాటు గ్యాస్ సిలిండర్ ధర రూ.500 చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్ ప్రసాద్, నాయకులు సంపత్, సుఖేందర్, జనగామ తిరుపతి పాల్గొన్నారు.

మిర్చి, మొక్కజొన్న పంట దగ్ధం

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని రొయ్యలపల్లికి చెందిన పాగే రాజుకిట్టు తన పంటచేనులో 10 క్వింటాళ్ల మిర్చి, 10 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ చేసుకున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. చేతికందిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజుకిట్టు తెలిపాడు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ముగిసిన మారెమ్మ జాతర

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి మారెమ్మ జాతర వైభవంగా ప్రారంభం కాగా మంగళవారంతో ముగిసింది. భక్తుల కొంగు బంగారంగా ఉన్న మారెమ్మ తల్లి జాతర రెండు రోజుల పాటు ఘనంగా సాగింది. మొదటి రోజు బోనాలతో ప్రారంభమైన జాతర మంగళవారం రోజున రథయాత్రతో ముగిసింది. రెండోరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకోగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ తోట ప్రవంతి, అశోక్ ఏర్పాటు చేశారు. ఈ జాతరకు కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్, నెన్నెల మండలాల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి తల్లికి పెద్ద ఎత్తున మేకలు, గొర్రెపోతులతో మొక్కులు చెల్లించుకున్నారు. మృగశిర కార్తే ప్రారంభమైన తర్వాత మొదటి వారంలో జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కోటపల్లి మండల వైస్ ఎంపీపీ వాల్‌శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, నాయకులు ఓదెలు, విద్యాసాగర్, పిల్లి సమ్మయ్య, సంపత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మారెమ్మ జాతర వద్ద భక్తుల సందడి



అమ్మవార్ల ఊరేగింపు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు



కన్నెపల్లిలో పూజలు చేస్తున్న అర్చకులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర శివపంచాయతన, ఆంజనేయ నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం మంగళవారం కొనసాగింది. అచ్చలాపూర్ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుద్దిళ్ల మనోహర అవధాని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అవాహిత దేవత పూజ, మూలమంత్రాహనం జరిపించారు. జలాధివాసంలో ఉన్న విగ్రహాలను భక్తులు ఆలయానికి తీసుకొచ్చిన అనంతరం ఫలపుష్పాధివాసాలు నిర్వహించారు. విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి శ్రీ శృంఘేరి శివగంగ మఠాధిపతి శ్రీ పురుషోత్తమ భారతి మహాస్వామి పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. పద్మశాలిభవన్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ వేడుకలను కనుల పండువగా జరిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం తగిన తోడ్పాటు అందిస్తోందన్నారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు బ్యాంకుల ద్వారా ఇతోధికంగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నరేందర్, బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామల దేవి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సీడీపీవో ఉమాదేవి, తాండూర్ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీపీలు పూసాల ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, రమాదేవి, మహిళలు పాల్గొన్నారు. బెల్లంపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుండటానికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. బాలికల విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య



చెన్నూర్: చిన్నారుల స్పీచ్ వింటున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: మహిళ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, గడిచిన తొమ్మిదేళ్లలో జిల్లాలో మహిళాభివృద్ధి కోసం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెన్నూర్ హబీబ్ ఫంక్షన్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మహిళా సంక్షేమ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రగతి నివేదికను చదివారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన మిల్లెట్స్ స్టాల్స్‌ను తిలకించారు. వివిధ శాఖల్లో ప్రతిభ కనబర్చిన మహిళా అధికారులను సన్మానించారు. సంక్షేమ దినోత్సవం సందర్భంగా ప్రీస్కూల్ పిల్లలు, అంగన్‌వాడీ టీచర్లు నృత్యాలు, పాటలు పాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శేషాద్రి, చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల మహిళ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజ్, సీడీపీవో మనోరమ, కౌన్సిలర్లు మేడ శరణ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగినికి సన్మానం

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల బీసీ సంక్షేమ హాస్టల్‌వార్డెన్ నూర్జహాన్‌ను దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చెన్నూర్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉద్యోగినిగా గుర్తించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా బీసీ సంక్షేమాధికారి వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎరువులు, విత్తనాల షాపుల్లో తనిఖీ

కోటపల్లి: రైతులకు విత్తనాలను అధిక రేట్లకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఓ మహేందర్ హెచ్చరించారు. కోటపల్లి, సర్వాయిపేటలోని ఫెర్టిలైజర్ షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. డీలర్లు ఎక్కువ రేట్‌కు అమ్మితే షాపులు సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. ప్రతి రైతుకు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రశీదు ఇవ్వాలని తెలిపారు. ఏఈవో రాజుకుమార్ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని పలు ఎరువులు, విత్తనాల షాపుల్లో మండల వ్యవసాయ అధికారిణిని కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి, రశీదు పొందాలని పేర్కొన్నారు.



తనిఖీ చేస్తున్న ఏవో మహేందర్

రద్దీగా ఆర్టీఓ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం తలెత్తిన సాంకేతిక సమస్యతో మంగళవారం ఆర్టీఓ కార్యాలయం వాహన చోదకులతో కిక్కిరిసింది. లర్నింగ్, డ్రైవింగ్, రిజిస్ట్రేషన్ తదితర వాటితో మొత్తంగా 320వరకు ఆన్‌లైన్‌లో స్లాట్‌లు బుకింగ్ అవుతాయి. సోమవారం దాదాపు 200వరకు ఆన్‌లైన్ స్లాట్‌లు బుకింగ్ కాగా దాదాపు 20స్లాట్‌లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికావడంతో, ఆన్‌లైన్ సాంకేతిక సమస్య తలెత్తింది. సాయంత్రం వరకు కూడా ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రాకపోవడంతో మంగళవారం వాహన చోదకులకు అవకాశం కల్పించారు. దీంతో మంగళవారం నాటి స్లాట్‌లతో పాటు సోమవారం నాటి స్లాట్‌లు కలిపి మొత్తం ఆర్టీఓ కార్యాలయానికి రావడంతో కార్యాలయం వాహన చోదకులతో నిండిపోయింది. డీటీఓ కిష్టయ్య, ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహన చోదకుల సేవలను త్వరితగతిన పూర్తి చేసేలా, చర్యలు చేపట్టడంతో దాదాపు అందరికీ పనులు పూర్తయ్యాయి.



వాహనదారులతో కిక్కిరిసిన కార్యాలయం

వీవోఏలు, మహిళా ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వీవోఏలు, మహిళా ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాలులో మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానించేందుకు కార్యక్రమానికి రమ్మని ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోశ్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా 37మందిని సన్మానించగా, మరో 80మంది వరకు వారి పేర్లు ఉన్నా తమను, రమ్మని పిలిచి ఎందుకు సన్మానించలేదని స్టేజి వద్ద ఆందోళనకు దిగారు. వీరితో పాటు, వీవోఏలు వారి డిమాండ్లను పరిష్కరించాలని గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తుండగా, వారి సమస్యలను చెప్పుకునేందుకు ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాలుకు రాగా, వారి సమస్యలను పట్టించుకోక పోవడంతో మహిళా ఉద్యోగులతో పాటు, వీవోఏలు ఆందోళనకు దిగారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం, వారు వెళ్లిపోవడంతో నిరాశతోనే వారు వెనుదిరిగారు.

జోనల్ క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బెల్లంపల్లి: ఏఎంసీ క్రీడా మైదానంలో మంగళవారం క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అండర్–16, అండర్–19 విభాగాల్లో పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక చేశారు. ఉత్తమంగా రాణించి జోనల్ క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్లు బుక్య రాముునాయక్, దామెర శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. జోనల్ క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు త్వరలో మందమర్రి కేంద్రంగా కోచింగ్ క్యాంపు ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. జోనల్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీ డాకారులను గుర్తించి రాష్ట్రస్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల క్రికెట్ అసోషియేషన్ జిల్లా ఇన్‌చార్జి నర్సింగ్, బెల్లంపల్లి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కోచ్‌లు శేఖర్, గౌతమ్, విజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

పాతమంచిర్యాల: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల నేపథ్యాన్ని విస్మరించి, ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలు ప్రకటిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా సమితి నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికులు, విద్యార్థులు, మేధావులు, కవులు కళాకారులు ప్రజలు సాగించిన ఉద్యమాల వల్లనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఫలితాలను ప్రభుత్వం తుడిచివేస్తుందని విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమాల నేపథ్యాలను స్మరించుకునే అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాగర్జన సభను విజయవంతం చేసిన అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, లింగం రవి, మిరియాల రాజేశ్వర్, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, దుర్గరాజు, బొంతల లక్ష్మీనారాయణ, సాలిగామ సంతోష్, మొగిలి లక్ష్మణ్, చాడా మహేందర్‌రెడ్డి, కుంచాల శంకరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలవేన శంకర్

స్థానికులకే కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వాలి

బెల్లంపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్‌ను అధిష్టాన వర్గం స్థానికులకే ఇవ్వాలని బెల్లంపల్లి కాంగ్రెస్ మైనార్టీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా సీనియర్ నాయకులు ఎండి.హనీఫ్, ఎండి గౌస్ మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకుల్లో, ఎవరికైనసరే టిక్కెట్ ఇస్తే కష్టపడి గెలిపించుకుంటామన్నారు. స్థానికేతరులకు టిక్కెట్ ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు భిన్నంగా స్థానికేతరులకు టిక్కెట్ ఇచ్చినట్లైతే తామే అభ్యర్థిని పోటీలో దింపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మైనార్టీ శ్రేణులు ఎంఏ ఖలీల్, ఖాజా మోహినోద్దిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

జేసీఐ సభ్యులకు జీఎం అభినందన

శ్రీరాంపూర్: మంచిర్యాల జోన్ పరిధిలో జేసీఐ నిర్వహించిన వివిధ కార్యక్రమాలకుగాను జేసీఐ రాష్ట్ర స్థాయిలో ప్రశిష్ట మిడ్కాన్–2023 అవార్డులు అందించింది. ఈ అవార్డులను గెలుచుకున్న మంచిర్యాల సభ్యులను మంగళవారం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి వారిని అభినందించారు. మున్ముందు కూడా మరిన్ని అవార్డులు సాధించాలన్నారు. జేసీఐ మంచిర్యాల అధ్యక్షుడు ఆర్మూల్లా రాజు, వెంకటేష్, సుమన్ చైతన్య, డాక్టర్ రాజా రమేష్, గురువయ్యలను ఈ సందర్భంగా జీఎం అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటూజీఎం గోపాల్‌సింగ్, డీజీఎం(వర్క్‌షాప్) చంద్రశేఖర్ రెడ్డి అధికారులు కిరణ్, రాజేశ్వర్, కాంతారావు పాల్గొన్నారు.



జేసీఐ సభ్యులను అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

శ్రీరాంపూర్: మనం పని చేసే చోట, మన ఇంటి చుట్టూ పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో మంగళవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం, ఇతర అధికారులు చీపురు చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా డిస్పెన్సర్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు జీఎం చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు సోమవారం ఏరియా జీఎం మోహన్‌రెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ధ్రువపత్రాలు అందించారు. ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుదర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'ఉత్పత్తిలో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి'



గనిని సందర్శిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

కాసిపేట: కాసిపేట–2 గని ప్రారంభించిన అనంతరం మొదటిసారి నెలవారి టార్గెట్ వంద శాతం పూర్తి చేసుకోవడం అభినందనీయమని ఉత్పత్తిలో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిని మంగళవారం జీఎం సందర్శించారు. ఈ సందర్భంగా గని కార్యాలయంలో గనికి సంబంధించి ప్లాన్‌లను పరిశీలించి, గనిలో దిగి అండర్‌గ్రౌండ్ పని స్థలాలను పర్యవేక్షించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాలను మరింత పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రూఫ్‌ఆఫ్ ఏజెంట్ కె.రాజేందర్, గని మేనేజర్ కె.లక్ష్మీనారాయణ, రక్షణాధికారి ఈ.సంతోష్‌రావు, ఇంజనీర్ భసవరాజు, క్విట్ ఇంజనీర్ రఘు, సర్వే అధికారి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మండల సభ వాయిదా

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమావేశం కోరం లేక వాయిదా పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు.

నియామకం

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలంగాణ రాష్ట్ర గొర్ల, మేకల అభివృద్ధి సహకార సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. త్వరలోనే అధికారికంగా ప్రకటన వెలువడనున్నట్లు సదానందం తెలిపారు.

'పాత కలెక్టరేట్ భవనం విద్యార్థులకే కేటాయించాలి'

మంచిర్యాలఅగ్రికల్చర్: పాత కలెక్టరేట్ భవనం ఎస్సీ గర్ల్స్ విద్యార్థుల వసతి గృహానికే కేటాయించా లని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, తిరుపతి, ఏఐఎస్ఎఫ్ నాయకులు సన్నీగౌడ్, సాయి ప్రదీప్, పీడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

'హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని వినతి'

మంచిర్యాలఅగ్రికల్చర్: మున్సిపాలిటీలో గల సాయికుంట చెరువు పరిధి విస్తీర్ణంపై సర్వే నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని 5వ వార్డు కౌన్సిలర్ హరికృష్ణ మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే సాయికుంట చెరువును సర్వే చేపట్టి హద్దురాళ్లు ఏర్పాటు చేసి నాపై వచ్చే ఆరోపణలపై తగు న్యాయం చేయాలన్నారు.

పాఠశాలల సందర్శన

కాసిపేట: మండలంలోని లంబాడితండా ఎంపీపీఎస్, జిల్లా పరిషత్ పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి దామోదర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. హెచ్ఎం లచ్చయ్య, వాణి కుమారి, సీఆర్‌పీ రమేష్ తదితరులున్నారు.

బీమా చెక్కు అందజేత

బెల్లంపల్లి: స్థానిక ఎస్‌బీఐ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు ఎస్.సుమతికి రూ.41,356 బీమా చెక్కును ఎస్‌బీఐ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జార బచ్చయ్య, జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ బుచ్చిబాబు, అరుణ్, ఐకేపీ మేనేజర్ దుర్గయ్య పాల్గొన్నారు.